క్లుప్తంగా

108 మంది భక్తులచే తులసి బృందార్చన


తులసి బృందార్చన చేస్తున్న దృశ్యం

భీమవరం (ప్రకాశంచౌక్): భీమవరం జెపి రోడ్డులోని పద్మావతి వెంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా శనివారం 108 మహిళా భక్తులచే 108 తులసి మొక్కలతో తులసి బృందార్చన పూజలు ఘనంగా నిర్వహించారు. ఆలయ ఈవో ముదునూరి సత్యనారాయణ రాజు, చైర్మన్ మంతెన రామ్ కుమార్ రాజు పర్యవేక్షణలో ఆలయ అర్చకులు స్వామి వారి అమ్మవారి ఉత్సవ విగ్రహాలకు ప్రత్యేక పూజలను నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పూజ కార్యక్రమంలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.

మావుళ్లమ్మ సేవలో పాకా


పాకా సత్యనారాయణను సత్కరిస్తున్న దృశ్యం

భీమవరం (ప్రకాశంచౌక్): పట్టణంలోని మావుళ్లమ్మ అమ్మవారిని రాజ్యసభ అభ్యర్థి పాకా వెంకట సత్యనారాయణ శనివారం దర్శించుకున్నారు. ఆపరేషన్ సిందూర్‌లో ధైర్యంగా పోరాడుతున్న మన సైనికులకు, భారత ప్రధాని మంత్రి నరేంద్ర మోదీకి శ్రేయస్సు చేకూరాలని, మన త్రివిధ దళాలకు యోగక్షేమాలు ప్రసాదించాలని కోరుకుంటూ ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రధాన అర్చకుడు మద్దిరాల మల్లికార్జున శర్మ పూజలు చేసి, ఆశీర్వచనాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ సహాయ కమిషనర్, కార్యనిర్వహణాధికారి బుద్ధ మహాలక్ష్మినగేష్ శేషవస్త్రం ప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షురాలు అయినంపూడి శ్రీదేవి, మాజీ జిల్లా అధ్యక్షుడు నార్ని తాతాజీ, జిల్లా ప్రధాన కార్యదర్శులు కోమటి రవి కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా ధ్వజారోహణ


పెదఅమిరం రాజేంద్రసూరిజీ జైన్ దేవాలయంపై ధ్వజారోహణ చేస్తున్న దృశ్యం

కాళ్ల: పెదఅమిరం గ్రామంలో ఉన్న ఆదినాథ్ జైన్ దేవాలయం ఎదుట ఉన్న జైనుల ఆరాధ్య గురువు రాజేంద్రసూరిజీ జైన్ (దాదావాడి) దేవాలయంపై ధ్వజారోహణ వేడుక శనివారం ఘనంగా నిర్వహించారు. శ్వేతాంబర్ తీర్థ ట్రస్టు, రాజేంద్రసూరి జైన్ దాదావాడి ట్రస్టు ఆధ్వర్యంలో ఏడాదికి ఒకసారి (వైశాఖ శుక్ల త్రయోదశి) నిర్వహించే ధ్వజారోహణ వేడుక రాజస్థాన్‌లో సియాణా గ్రామానికి చెందిన మితాలాలజీ మగాజీసోలంకి కుటుంబ సభ్యులు నిర్వహించే వేడుకలో వారి కుటుంబ సభ్యులు రమేష్ జైన్ దంపతులు పాల్గొని ఈ వేడుక నిర్వహించినట్లు ట్రస్టు అధ్యక్షుడు కె.మహేంద్రజైన్ తెలిపారు. ఈ వేడుకలో వివిధ ప్రాంతాలకు చెందిన జైనులు పాల్గొని దాదావాడిలో గురువును దర్శించి ఆశీర్వాదం పొందారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు ప్రతినిధులు రమేష్ జీ, కాంతిలాల్ జైన్, వినోద్ జైన్, ప్రసన్నదేవి తదితరులు పాల్గొన్నారు.

ఆవుదూడకు చికిత్స


అమృతరావు కాలనీలో అనారోగ్యానికి గురైన ఆవుదూడకు వైద్యం చేస్తున్న దృశ్యం

ఆకివీడు: స్థానిక అమృతరావు కాలనీ ప్రాంతంలో సంచరిస్తున్న ఆవుల మందలోని దూడ విషపు ఆహారం తిని అనారోగ్యానికి గురై పడిపోవడంతో అక్కడి స్థానికులు శనివారం స్థానిక విశ్వ హిందూపరిషత్ సభ్యులకు తెలియజేశారు. హుటాహుటీన అక్కడకు వెళ్లిన సభ్యులు స్థానిక పశువుల వైద్యులకు తెలియజేయడంతో ఆయన వచ్చి చికిత్స అందజేశారు. ప్రస్తుతం ఆవుదూడ ఆరోగ్యంగా తిరుగుతుందని స్థానికులు తెలిపారు. కార్యక్రమంలో విశ్వ హిందూ పరిషత్ సభ్యులు సన్నిధి మాణిక్యాలరావు, నంద్యాల చల్లారావు, చింతా ఆదిశేషు, వీరమల్లు రంగారావు తదితరులు పాల్గొన్నారు.

98 మందికి ఉద్యోగాలు

ఆకివీడు: స్థానిక విద్యా వికాస్ డిగ్రీ కళాశాల ఆవరణలో నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూల్లో 98 మందికి ఉద్యోగాలకు ఎంపికైనట్లు నిర్వాహకురాలు ప్రిన్సిపాల్ నాగలక్ష్మి శనివారం రాత్రి విలేకరులకు తెలిపారు. ఇంటర్వ్యూలకు 120 మంది నల్గొండ నుంచి హాజరయ్యారని ఆమె చెప్పారు. ఫ్లిప్ కార్ట్, యాక్సిస్ బ్యాంక్, రేమండ్ ,మహేంద్ర, వాల్ మార్ట్, కొటక్ టాటా మ్యూచువల్, బీహెచ్ఈఎల్ తదితర 12 సంస్థల నుంచి క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించినట్లు తెలిపారు. యువతీ యువకులకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

మినరల్ కాదు.. జనరల్!

- ప్రజారోగ్యంతో చెలగాటమాడుతున్న వ్యాపారులు
- అనుమతుల్లేకుండా వెలుస్తున్న ప్లాంట్‌లు చోద్యం చూస్తున్న అధికారులు


శృంగవృక్షంలో వాటర్ ప్లాంట్ ద్వారా అమ్మకానికి నీటిని పట్టుకెళ్తున్న దృశ్యం

పాలకోడేరు: నియోజకవర్గంలోని ఉండి, ఆకివీడు, పాలకోడేరు పరిసర ప్రాంతాలలో 42 మినరల్ వాటర్ ప్లాంట్లు ఉన్నాయి. మినరల్ వాటర్(శుద్ధజలం) పేరిట నీటి దందా జోరుగా సాగుతోంది. ఆదాయం ఉంటుండటంతో పుట్టగొడుగుల్లా వాటర్‌ప్లాంట్లు వెలుస్తున్నాయి. ఆదాయమే లక్ష్యంగా పెట్టుకోవడంతో నాణ్యతా ప్రమాణాలు, నిబంధనలకు తూట్లు పొడిచి ప్రజల ఆరోగ్యాలతో చెలగాటమాడుతున్నారు. ఈ దందాను రెవెన్యూ అధికారులు చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నారు. ఏళ్ల నుంచి వాటర్ ప్లాంట్ల వ్యాపారులు దందా చేస్తున్నప్పటికీ చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. హోటళ్లు, చిరువ్యాపారులు, మధ్యతరగతి ప్రజలు మినరల్ వాటర్ క్యాన్లు కొనడంతో నీటి వ్యాపారం అధికమైంది. అదేవిధంగా పలువురు వ్యాపారులు ఎక్కడ పడితే వాటర్ ప్లాంట్లు నెలకొల్పుతూ నిబంధనలకు నీళ్లొదులుతున్నారు.

బోరు నుంచే తోడుతున్నారు.

ఇళ్లలో ఖాళీ స్థలాల్లో బోర్లు వేసి వాటర్ ప్లాంట్లు ఏర్పాటు చేసుకొని వ్యాపారాలు నిర్వహిస్తున్నారు. ఇంటి బోరుతో వాణిజ్య అవసరాలకు వినియోగించడానికి వీల్లేదు. పరిసర ప్రాంతాల్లో భూగర్భ జలాలు అడుగంటుతాయి. వాల్టా చట్టం ప్రకారం చర్యలు తీసుకోవాల్సిన అధికారులు తమకేమీ తెలియనట్లుగా వ్యవహరిస్తున్నారు. నిబంధనల ప్రకారం మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయాలంటే రూ.15లక్షల నుంచి రూ.25లక్షల వ్యయంతో వాటర్ ప్లాంట్లను ఏర్పాటు చేస్తున్నారు. వీటికి ఎలాంటి అనుమతులు లేవు. వీటిని పర్యవేక్షణ చేయాల్సిన అధికారులు ఎవరికి వారు తమ పరిధి కాదంటూ ప్రేక్షకపాత్ర వహిస్తుండటంతో వ్యాపారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు.

నీటి శుద్ధి ప్రక్రియ ఇది..

నిబంధనల ప్రకారం నీటిని 12సార్లు శుద్ధి ప్రక్రియ చేయాల్సి ఉంటుంది. ఫిల్టరింగ్, ఎరేషన్, కార్బన్ ఫ్యాక్టరైజేషన్ లాంటి ప్రక్రియలు జరపాలి. ఆ తర్వాత నీటిని డబ్బాల్లో నింపే ముందు 48గంటల పాటు పక్కన నిల్వ ఉంచాలి. అనంతరం కెమిస్ట్ పరీక్షలు జరపాలి. ఇందుకోసం నాణ్యత పరికరాలతో కూడిన మైక్రోబయలాజికల్ ల్యాబ్ ఉండాలి. కెమిస్ట్‌ను నియమించుకుని ఎప్పటికప్పుడు నీటిని పరీక్షించాల్సి ఉంటుంది. నాణ్యత ప్రమాణాలు పాటించకుండా శుద్ధి చేసిన నీళ్లను తాగితే ఆరోగ్యంపై ప్రభావం చూపుతాయి.

వ్యాపారానికి ఐఎస్ఐ, బీఎస్ఐ లాంటి ధ్రువీకరణ పత్రాలు పరిశీలించాలి

ఇసుక, కార్బన్, పిల్టరైజేషన్ ప్లాంట్లు తప్పనిసరిగా ఉండాలనే విషయాన్ని గుర్తించాలి. రివర్స్ అసోస్మిస్ సిస్టం ద్వారా నీటిలో బ్యాక్టీరియాను నిర్మూలించే వ్యవస్థ ఉందో లేదో తెలుసుకోవాలి. బయలాజికల్, బ్యాక్టీరియా పరీక్షలు జరుపుతున్నారో అడగాలి. ప్యాకింగ్‌పై వివరాలు ముద్రిస్తున్నారో లేదో గమనించాలి. రెండు ల్యాబ్‌లతో పాటు కెమిస్ట్, మైక్రో బయాలాజిస్టు ఉన్నారో లేదో కనుక్కోవాలి.

మినరల్ వాటర్ ప్లాంట్ నిర్వహణ పంచాయతీలదే

గ్రామాల్లో ప్రైవేట్ వాటర్ ప్లాంట్ల నిర్వహణ పంచాయతీలదే. వారు పంచాయతీల తీర్మానాలు ద్వారానే సంబంధించిన శాఖల నుంచి అనుమతి పొందాల్సి ఉంటుంది. ఇప్పటికే గ్రామాల్లో వెలిసిన మినరల్ వాటర్ ప్లాంట్లును గుర్తించాం. ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటాం.

ఎం.వి.ఎస్ రాంప్రసాద్, ఈవోపీఆర్డీ, పాలకోడేరు

ప్లాంట్ జలాలపై అధికారులు తనిఖీలు నిర్వహించాలి



పంచాయతీ సరఫరా చేసే నీరు బాగుండకపోవడంతో ప్రైవేట్ వాటర్ ప్లాంట్ జలాలు కొనుగోలు చేసి తాగుతున్నాం. కానీ అప్పుడప్పుడు ఈ నీటిని తాగడం వల్ల కూడా చిన్నచిన్న సమస్యలతో బాధపడుతున్నాం. ఈ జలాలు నాణ్యతతో కూడినవని అధికారులు తరచూ తనిఖీలు నిర్వహించాలి. అప్పుడే మా ఆరోగ్యాలను కాపాడుకోగలం.

కె వై రత్నం, మోగల్లు

పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయి



ప్రతి గ్రామంలో మినరల్ వాటర్ ప్లాంట్‌లు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయి. వీటికి ఐఎస్ఐ లాంటి అనుమతి ఉందా లేదా అన్న సందేహాలు కూడా వస్తున్నాయి. మంచి జలాలు అందించే చర్యలు అధికారులు చేపట్టాలి. ఐఎస్ఐ తదితర అనుమతులు ఉన్నాయి. అని బోర్డులు పెట్టేలా అధికారులు చూడాలి.

గుబ్బల రాజ్‌కుమార్, గొల్లలకోడేరు

చర్యలు చేపడతాం

గ్రామాల్లో ఉన్న అనుమతి లేని వాటర్ ప్లాంట్లపై గతంలో ఫిర్యాదులు వచ్చాయి. ప్రస్తుతం వాటి మీద దృష్టి పెడుతున్నాం. మోభూగర్భ జలాల అధికారులను పిలిపించి పరీక్షలు చేయించి చర్యలు చేపడతాం.

కె సుజాత , పంచాయతీ కార్యదర్శి మోగల్లు

పౌష్టికాహారంతోనే మంచి ఆరోగ్యం

భీమవరం: నిత్యం పౌష్టికాహారం తీసుకోవడంతో మంచి ఆరోగ్యం సొంతం చేసుకోవచ్చని పలువురు వక్తలు తెలిపారు. భీమవరం మానవత సంస్థ ఆధ్వర్యంలో హెచ్ఐవి బాధిత కుటుంబాల పిల్లలకు శనివారం పౌష్టికాహారం అందజేశారు. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షుడు పెన్మెత్స రామ్మోహనవర్మ, చైర్మన్ బుద్ధరాజు వెంకటపతిరాజులు మాట్లాడుతూ తమ సంస్థ ఆధ్వర్యంలో హెచ్ఐవి బాధిత కుటుంబాల పిల్లలకు ప్రభుత్వం అందజేసే మందులతో పాటు పౌష్టికాహారం అందజేస్తున్నామన్నారు. క్రమం తప్పకుండా ప్రతి నెలా రెండవ శనివారం సంస్థ సభ్యుల సహకారంతో పౌష్టికాహారం అందిస్తున్నామన్నారు. సంస్థ కో- చైర్మన్ కారుమూరి నర్సింహమూర్తి, ఎగ్జిక్యూటివ్ అల్లు శ్రీనివాస్ మాట్లాడుతూ దినేష్ కుమార్ జైన్, పళ్ల శేషలీల ఆర్థిక సహకారంతో భోజనం ప్యాకెట్లు, ఎనిమిది రకాల పప్పు దినుసులు, డ్రై ఫ్రూట్స్, వాటర్ ప్లాస్కులు అందజేశామన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఎం గోవిందబాబు,డాక్టర్ వేముల రాంబాబు, సంస్థ కోశాధికారి గ్రంధి కుమార వెంకటేశ్వర ప్రసాద్, చేకూరి జాన్సీలక్ష్మి, సిహెచ్ రామకృష్ణంరాజు, వడ్డి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పిల్లలకు తల్లుల ఆశీర్వచనం


చిన్నారులతో చిత్రాల గీయిస్తున్న దృశ్యం

పాలకోడేరు: చిన్న వయస్సు నుంచే పిల్లలు తల్లిదండ్రులను ఏవిధంగా గౌరవించాలి అనేది తల్లికి వందనం కార్యక్రమం తెలియజేస్తుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పార్వతి తెలిపారు. శనివారం పాలకోడేరు మండలం మోగల్లులో అంతర్జాతీయ మాతృ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా పిల్లలతో తల్లులకు పాదాభివందనం చేయించి, వారికి తల్లులతో ఆశీర్వచనం ఇప్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లా కోఆర్డినేటర్ రమణకుమార్ మాట్లాడుతూ ఈ కార్యక్రమం ద్వారా పిల్లలు మంచి అలవాట్లు అలవరచుకోవడంతో పాటు, తల్లిదండ్రులను ఎలా గౌరవించాలనేది నేర్చుకుంటారన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు పౌష్టికాహారాన్ని అందజేస్తున్నట్లు తెలిపారు. చిన్నారులు తల్లులకు ఆటల పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్లు విమల, చంద్రకుమారి, శ్రీదేవి, రాధ, నాగలక్ష్మి, మంగతాయారు, జోత్స్న సుబ్బలక్ష్మి, చిన్నారుల తల్లులు పాల్గొన్నారు.

శని త్రయోదశి పూజలు



పెనుగొండ: శని త్రయోదశి సందర్భంగా పెనుగొండలో శనీశ్వరుడికి అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. శనివారం ఉదయం నుంచి శ్రీనగరేశ్వర మహిషాసురమర్దనీ వాసవీ కన్యకప రమేశ్వరి ఆలయంలోని నవగ్రహ ఉపాలయంలో అర్చకుడు కేవీ సూర్యనారాయణ మూర్తి ఆధ్వర్యంలో శనీశ్వరుడుకి క్షీరాభిషేకం, తైలాభిషేకం, పలరస అభిషేకం చేశారు. అనంతరం నవగ్రహాలను అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. పరిసర ప్రాంతాల భక్తులు దర్శనం చేసుకొన్నారు.

జాతీయ సమ్మెను విజయవంతం చేయాలి


భీమవరంలో కార్మిక సంఘాల జిల్లా సదస్సులో మాట్లాడుతున్న గోపిమూర్తి

భీమవరం: లేబర్ కోడ్స్ రద్దు కోరుతూ ఈనెల 20వ తేదీన నిర్వహిస్తున్న జాతీయ సమ్మెలో కార్మిక వర్గం పెద్ద సంఖ్యలో పాల్గొనాలని ఎమ్మెల్సీ బి గోపిమూర్తి పిలుపునిచ్చారు. శనివారం భీమవరంలోని యూటీఎఫ్ కార్యాలయంలో సీఐటీయు జిల్లా ఉపాధ్యక్షుడు బి వాసుదేవరావు అధ్యక్షతన జరిగిన జాతీయ కార్మిక సంఘాల జిల్లా సదస్సులో ఆయన మాట్లాడారు. ఎనిమిది గంటల పనిని మార్పు చేసి 14 గంటలు పనిచేయాలనే కార్పొరేట్ శక్తుల వాదనను తిప్పి కొట్టాలన్నారు. కేంద్ర ప్రభుత్వం అన్ని రకాల చట్టాలను మార్చుకుంటూ పాత బానిస విధానాన్ని అమలు చేయాలని రాజ్యాంగాన్ని నాశనం చేయాలని చూస్తోందని దుయ్యబట్టారు. దేశవ్యాప్తంగా కార్మిక వర్గం, ఉద్యోగులు, ప్రభుత్వ రంగ సంస్థ సిబ్బంది సమ్మెలో పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలన్నారు. కొత్తగా వచ్చిన నాలుగు లేబర్ కోడ్‌ల వలన యాజమాన్యాలకి పూర్తిగా లాభం జరుగుతుంది తప్ప కార్మికులకు ఎటువంటి ప్రయోజనం ఉండదని గోపిమూర్తి ఆందోళన వ్యక్తం చేశారు. కనీస వేతనం రూ. 26 వేలు ఇవ్వాలని, ప్రభుత్వ రంగ సంస్థలు కాపాడాలని, సమాన పనికి సమాన వేతనం కోసం సమ్మె చేపట్టినట్లు చెప్పారు. ఏఐటియుసి జిల్లా నాయకుడు చెల్లబోయిన రంగారావు మాట్లాడుతూ చట్టాల మార్పు దేశ పారిశ్రామికాభివృద్ధికి విఘాతం కలిగిస్తుందని, బ్రిటిష్ పాలకులను ఎదిరించి సాధించిన కార్మిక చట్టాలను మార్చడం కేంద్రానికి తగదన్నారు. ఈ సమావేశంలో ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకుడు రామ్మోహన్, యుటీయుసీ నాయకుడు డి శ్రీనివాసరాజు, ఏఐసీసీటీయు నాయకుడు మహంకాళి, జక్కంశెట్టి సత్యనారాయణ, డి కళ్యాణి, కిల్లరి మల్లేశ్వరరావు, ఎం రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

మత్తును చిత్తు చేద్దాం


భీమవరంలో మత్తు పదార్థాలకు బానిసలై చికిత్స పొందుతున్న వారితో మాట్లాడుతున్న ప్రసాద్‌రెడ్డి

భీమవరం: సాధారణ సమస్యలను సైతం తీవ్రమైన సమస్యలుగా భావించి పరిష్కార మార్గం చూసుకోకుండా మద్యం, మత్తు పదార్థాలను అలవాటు చేసుకుని వేరొక సమస్యను కొనితెచ్చుకోవద్దని ఎక్సైజ్ శాఖ జిల్లా అధికారి రెడ్డివారి ప్రసాద్‌రెడ్డి అన్నారు. భీమవరం ఎక్సైజ్ శాఖ, శ్రీ విజ్ఞాన వేదిక సంయుక్త ఆధ్వర్యంలో శనివారం మాదక ద్రవ్యాలకు బానిసలైన ఇబ్బందులు పడుతున్నవారిని పట్టణంలోని శాంతి నర్సింగ్ హోంలో పరిశీలించి వారికి సూచనలు, సూచనలు అందజేశారు. ప్రభుత్వం ఎక్సైజ్ శాఖ ×కేర్ట్ ఆర్గనైజేషన్‌తో మద్యం, మత్తు పదార్థాలకు బానిసలైనవారి కోసం రాష్ట్ర వ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. జిల్లాలోని భీమవరం , నరసాపురం, తణుకు ప్రాంతాల్లో బాధితులకు అవగాహన, పర్యవేక్షణ కార్యక్రమాలను చేపడుతున్నామన్నారు. భీమవరంలో ముగ్గురు సభ్యులను గుర్తించి వారితో మాట్లాడగా కేవలం కుటుంబ సమస్యల వల్లే మత్తు పదార్థాలకు బానిసలైనట్లు తెలిపారని అటువంటి వారికి కేర్ ద్వారా కౌన్సిలింగ్ ఇస్తున్నట్లు ప్రసాద్‌రెడ్డి చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ సీఐ కె బలరామరాజు, డాక్టర్ సుభాష్, డాక్టర్ శ్రీదేవి, చెరుకువాడ రంగసాయి తదితరులు పాల్గొన్నారు.

ఉగ్రవాదులను సమూలంగా ఏరివేయాలి


ఆకివీడు: జాతీయ పతాకంతో జైహింద్ అంటూ నినాదాలు చేస్తున్న బీజేపీ నాయకులు


కాళ్లకూరు వెంకటేశ్వరస్వామి ఆలయంలో మాట్లాడుతున్న వక్తలు

ఆకివీడు: భారత్ చేస్తున్న యుద్ధం విజయవంతం కావాలని కోరుతూ స్థానిక దేవాలయాల్లో బీజేపీ నాయకులు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా బీజేపీ మండల అధ్యక్షురాలు ముదునూరి నాగమణి మాట్లాడుతూ ఉగ్రవాదులకు అడ్డాగా ఉన్న పాకిస్తాన్‌కు కూడా తగిన గుణపాఠం వచ్చే విధంగా భారత్ చేస్తున్న యుద్ధం విజయవంతం అవుతుందన్నారు. త్వరలోనే పాక్ తోక ముడిచి, చర్చలకు సిద్ధమవుతోందని చెప్పారు. యుద్ధంలో భారతీయ జవాన్‌లకు ఏవిధమైన ప్రమాదం జరగకుండా బయటపడే విధంగా దైవం సహకరించాలని ప్రార్థించినట్లు, ప్రత్యేక పూజలు చేసినట్లు నాగమణి వివరించారు. కార్యక్రమంలో యర్రా రఘు, పట్టాభి, చింతా ఆదిశేషు, నరహరశెట్టి నానాజీ, నంద్యాల చల్లారావు, మోహనరావు, తోట బాబి, సన్నిధి మాణిక్యాలరావు, పలువురు ఆధ్యాత్మిక వేత్తలు భమిడిపాటి సూర్య భాస్కరరావు పాల్గొన్నారు.

వెంకన్న ఆలయంలో సైనికులకు సంఘీభావంగా పూజలు

కాళ్ల: పాకిస్తాన్ పై యుద్ధం చేస్తున్న భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, సైనికులకు బలం శ్రేయస్సు చేకూరాలని సంఘీభావం తెలుపుతూ కాళ్లకూరు వెంకటేశ్వరస్వామి ఆలయంలో బీజేపీ శ్రేణులు శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు.సైనికులకు మంచి జరగాలని పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు పానకాల కృష్ణాంజనేయరావు, జిల్లా నాయకులు సుంకర కాశీ విశ్వేశ్వరరావు, గాదిరాజు వెంకటేశ్వరరాజు, యాతం వెంకట సుబ్బారావు, ఐ.కె.రాజు, బలరామరాజు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వెంకటేశ్వర స్వామి కల్యాణోత్సవాలు


స్వామివారి కల్యాణోత్సవ దృశ్యం


పల్లకిపై స్వామి, అమ్మవార్లు

భీమవరం(ప్రకాశంచౌక్): పట్టణంలో జెపీ రోడ్డులోని పద్మావతి సమేత వెంకటేశ్వరస్వామి వార్షిక కల్యాణోత్సవాలు శనివారం ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) స్వామికి పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలను అందజేశారు. అనంతరం వేద మంత్రాలతో కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు కల్యాణాన్ని తిలకించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో ముదునూరి సత్యనారాయణ రాజు, చైర్మన్ మంతెన రామ్‌కుమార్‌రాజు భక్తులు పాల్గొన్నారు.

వెంకన్నకు ఘనంగా పుష్పార్చన

కాళ్ల: మండలంలోని కాళ్లకూరు గ్రామంలో వెంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాలు ఐదో రోజు శనివారం నిత్యపాసన, పంచసూక్తహనం నిర్వహించారు. అనంతరం స్వామివారికి విశేషంగా లిల్లీపూలతో పుష్పార్చన నిర్వహించి, నీరాజన మంత్రపుష్పాలు అందజేశారు. సాయంత్రం స్వామివారికి గ్రామోత్సవం నిర్వహించారు. ఆలయానికి పెద్ద ఎత్తున భక్తులు విచ్చేసి స్వామివారిని దర్శించుకున్నారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా దేవస్థానం ఈఓ ఎం.అరుణ్ కుమార్, సిబ్బంది ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ప్రజల పక్షాన పోరాడుదాం

యలమంచిలి: వైఎస్సార్ సీపీ కార్యకర్తలకు కష్టాలు కొత్త కాదనీ.. నాలుగేళ్లు ఓర్పుకుంటే మళ్లీ విజయం మనదేనని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ఉచ్చుల స్టాలిన్‌బాబు చెప్పారు. యలమంచిలి మండలం కొంతేరు గ్రామంలో శనివారం రాత్రి నిర్వహించిన పార్టీ గ్రామ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. జగనన్న 2.0 పాలనలో కార్యకర్తలకు న్యాయం చేకూరుతుందని చెప్పారు. కూటమి నాయకులు ఎన్ని కష్టాలకు గురిచేసినా ఓరిమితో ప్రజల పక్షాన పోరాటం చేద్దామని సూచించారు. ఇచ్చిన హామీలను నెరవేర్చలేని కూటమి ప్రభుత్వం విద్యుత్ చార్జీలు పెంచి ప్రజలపై అదనపు భారం వేయడం సరికాదన్నారు. అనంతరం పార్టీ నూతన గ్రామ కమిటీని ఎంపిక చేశారు. ఈ మేరకు జాబితాను పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి) కార్యాలయానికి పంపారు. తొలుత యుద్ధంలో వీరమరణం పొందిన జవాన్ మురళీనాయక్ ఆత్మకు శాంతి కలగాలని కోరుతూ రెండు నిమిషాలు మౌనం పాటించారు. కార్యక్రమంలో ఎంపీపీ గొల్లపల్లి శ్రీనివాసరావు, పార్టీ నాయకులు వినుకొండ రవి, నిమ్మకాయల రామకృష్ణ, కుక్కల రామకృష్ణ, కానుకొలను చిట్టిబాబు, జల్లి శాంతరావు, కొయ్యే నాగేశ్వరావు, జోగి రాజేష్, తేన్నేటి అలెగ్జాండర్, బందెల జార్జి, గొట్టుముక్కల జగజీవన్‌రావు, పత్తికాయల దుర్గాప్రసాద్, ఏనుగుపల్లి చల్లారావు, సిల్లే రాజు, జక్కంశెట్టి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బాల్యానికి సరైన దారి చూపితే విజయం తథ్యం


చెరుకువాడ చినపేటలో చిన్నారులతో పాస్టర్ జార్జ్‌ముల్లర్, సీఆర్ సామ్యూల్

ఉండి: బాల్యానికి సరైన దారి చూపిస్తే భవిష్యత్ జీవితంలో విజయం తథ్యమవుతుందని చెరుకువాడ సీబీసీఎన్‌సీ చర్చ్ పేరిష్ పాస్టర్ రెవరెండ్ డాక్టర్ ఎస్ జార్జ్‌ముల్లర్ అన్నారు. చెరుకువాడ చినపేటలో చిన్నారులకు ఐదురోజుల పాటు నిర్వహించిన వేసవి కాల బైబిల్ తరగతులు శనివారంతో ముగిసాయి. ముఖ్య అతిధిగా హాజరైన డాక్టర్ జార్జ్‌ముల్లర్ మాట్లాడుతూ వేసవిలో ప్రతి చర్చ్‌లోను ఈ విధంగా చిన్నారుల బైబిల్ తరగతులు నిర్వహించడం ద్వారా చిన్నారులను ఆధ్యాత్మికత వైపు నడిపించవచ్చునని అన్నారు. అంతే కాకుండా వారిలో ఉండే కళలను, నైపుణ్యాలను కూడా వెలికితీసే అవకాశం ఉంటుందని అన్నారు. మనిషి జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవాలంటే భయం ఉండకూడదని అన్ని విషయాల్లోను ముందుకు వెళ్లేలా బాలబాలికలకు సూచనలు, సలహాలను అందజేయాలని తెలిపారు. కథలు చెప్పడం, స్పీచ్ ఇవ్వడం వంటివి కూడా వారిని నాయకులుగా నిలుపుతాయన్నారు. దీనిద్వారా భవిష్యత్‌లో వారంతా ఉన్నతమైన ఆలోచనలు కలిగి మంచి భవిష్యత్‌ను సాధిస్తారని అన్నారు. సమాజానికి ఉపకారులుగా వారిని తీర్చిదిద్దేందుకు బైబిల్ తరగతులు ఎంతో సహకరిస్తున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో సంఘ సీఆర్ ఎం శామ్యూల్, సంఘ పెద్దలు కడలి యేసు, మద్యా సుబ్బారావు, బొబ్బనపల్లి జార్జ్, తాడి పవన్, పీ మార్కురాజు, బీ శ్రీకాంత్, సండెస్కూల్ టీచర్స్ ఎస్ దేవాప్రిస్కిల్లా, ఎం దీప్తి, కే మణిమేఘన, కే లికిత, పీ కుమారి, ఈ కొగ్లా తదితరులు పాల్గొన్నారు.